సాక్షి
గుంటూరు

మంగళవారం । 28 । మార్చి । 2023



నృసింహుని హుండీ లెక్కింపు

మంగళగిరి: స్థానిక శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. దిగువ సన్నిధిలోని ముఖ మండపంలో లెక్కించగా ఆదాయం రూ.41,48,381 సమకూరింది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,200, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



జాతీయ పోటీలకు లిఫ్టర్ల ఎంపిక

మంగళగిరి: జాతీయ పోటీలకు ఇద్దరు లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. వీరిలో వి.రేవతి, బి.చంద్రిక ఉన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
గుంటూరు	6:25	4:49
నరసరావుపేట	6:27	4:46
బాపట్ల	6:25	4:49

న్యూస్‌రీల్

సబ్ జైలు తనిఖీ



గురజాల: స్థానిక సబ్‌జైలును జూనియర్ సివిల్ జడ్జి కె.మంజులత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలు తాగునీటి వసతి సరిగ్గా లేదని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జడ్జి నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు నిర్వహించి ఖైదీలకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. అదే విధంగా ఖైదీలకు వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదుల బాక్స్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆమె వెంట న్యాయవాది కలివెల ప్రభుదాసు ఉన్నారు.

మిర్చి యార్డుకు 92,254 బస్తాల రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు 92,254 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలపి ఈ–నామ్ విధానం ద్వారా 89,659 బస్తాలు కొనుగోళ్లు జరిగింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,011 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వైద్యసిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



నరసరావుపేట: ప్రతి ఒక్కరూ రీ–ఓరియంటేషన్‌ను వినియోగించుకొని లక్ష్యాలను వంద శాతం సాధించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం తన కార్యాలయంలో జిల్లా గణాంక విభాగం ద్వారా జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని ఏఎన్‌ఎంలకు చేపట్టిన పదిరోజుల శిక్షణను ప్రారంభించారు. మొదటిరోజు నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల ఏఎన్‌ఎంలకు ఆర్‌సీహెచ్, ఏఎన్‌ఎంఓఎల్ ప్రోగ్రాము, సీఎస్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎంఐఎస్ రిపోర్టింగ్ ఫార్మెట్స్, యాప్‌లపైన శిక్షణతో పాటు ఆన్‌లైన్ సర్వీసులను పూర్తిగా వందశాతం వినియోగించుకొని ఫలితాలు సాధించే విధంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జి.చంద్రశేఖర్, డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

ఐదుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్–2 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 43,613 మంది విద్యార్థుల్లో 42,468 మంది విద్యార్థులు సోమవారం పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. మాచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిలకలూరిపేటలోని సీఆర్ జూనియర్ కళాశాలలో ఇద్దరు చొప్పున, ఏఎంజీ జూనియర్ కళాశాలలో ఒకరు పట్టుబడ్డారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

- ఇళ్ల వద్దకే వైద్యం
- గ్రామాల్లోనే ఉచిత వైద్య సేవలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 104 వాహనాల ప్రారంభం

చిలకలూరిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని అధికారికంగా ప్రారంభించబోతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాకు సంబంధించిన నూతన 104 మొబైల్ మెడికల్ వాహనాలను స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అందు కోసం ఇప్పటికే నూతన 104 వాహనాలను సమకూర్చుకున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 వాహనాలను అన్ని జిల్లాలకు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 104 వాహనాలు 676 ఉన్నాయని, ఇప్పుడు వీటికి అదనంగా మరో 260 వాహనాలు వచ్చి చేరాయని చెప్పారు.

విజయవంతంగా ట్రయల్ రన్...

ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి రజిని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇది ఒక గొప్ప కార్యక్రమంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను జగనన్న అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో ఈ విలేజ్ క్లినిక్‌లు కీలకంగా మారనున్నాయని చెప్పారు. ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండేలా నియామకాలు పూర్తి చేశామని, వీరిలో డాక్టర్ కచ్చితంగా మొబైల్ వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందజేస్తారన్నారు. ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో 104 వాహనం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వచ్చేలా కార్యక్రమం రూపొందించినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించటం ఉచితంగా చికిత్స అందించటం వైద్యుల విధి అని పేర్కొన్నారు. ఏకంగా 14రకాల పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ప్రస్తుతానికి 67 రకాల మందులు కూడా ఉచితంగానే అందజేస్తారని చెప్పారు. త్వరలో మందుల సంఖ్య 105కు పెంచనున్నమన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు కూడా ప్రత్యేక వైద్య సేవలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో లభిస్తాయని చెప్పారు. డాక్టర్లు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. కదలలేని పరిస్థితుల్లో మంచంలో ఉన్న రోగుల ఇళ్లకు వైద్యులు వచ్చి చికిత్స అందిస్తారని తెలిపారు. దీంతో పాటు ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు వ్యవస్థ ద్వారా ఆరోగ్య వివరాలన్నింటిని పదిల పరుస్తారని వివరించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి నిలిపిందని చెప్పారు. మంత్రి రజిని స్వయంగా 104 వాహనం నడిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జి.శోభారాణి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్



సిద్ధంగా ఉన్న 104 వాహనాలు



104 వాహనాన్ని నడుపుతున్న మంత్రి రజిని

104 వాహనాలు ప్రారంభం



గుంటూరు వెస్ట్: పేదల ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అద్భుతమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. జిల్లాకు అదనంగా వచ్చిన నాలుగు 104 వాహనాలను స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిర ఆవరణలో సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 104 వాహనాలు 17 ఉన్నాయని కొత్తగా వచ్చిన నాలుగుతో కలపి 21 అవుతాయని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన నాలుగు వాహనాలను మంగళగిరి, తాడేపల్లి, ప్రత్తిపాడు ప్రాంతాల్లో ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తున్నాయని వివరించారు. అధికారులు, సిబ్బంది ప్రజలు ఉత్తమ సేవలందిస్తే దానికి ప్రతిఫలం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి దేవి, సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గణిక ఝాన్సీ పాల్గొన్నారు.

వృద్ధుడికి కళ్లజోడు ఇప్పించిన కలెక్టర్

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా వృద్ధులు అవసరం మేరకు కళ్లజోళ్లు పొందాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో దుగ్గిరాల గ్రామానికి చెందిన జి.చెన్నయ్య(72) తనకు కళ్లజోడు కావాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందించి అక్కడే ఉన్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని పిలిపించి పరీక్షలు నిర్వహించి కళ్లజోడు ఇప్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పుష్పార్చన.. పులకింత

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో ఆరో రోజైన సోమవారం కాగడా మల్లెలు, జాజులు, మరువంతో అర్చన నిర్వహించారు. విశేష పుష్పార్చన నిమిత్తం తీసుకు వచ్చిన పుష్పాలతో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి నిర్వహించిన విశేష పుష్పార్చనలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం అమ్మవారికి పంచహారతులు, నివేదన సమర్పించారు. పుష్పార్చన అనంతరం పుష్పాలను అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు.

నేడు దేవదాయ శాఖ మంత్రి రాక..

ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్న జాజులతో అర్చన జరుగుతుంది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా పాల్గొంటారని అర్చకులు పేర్కొన్నారు.



టీడీపీ నేతలు సంప్రదించారు..

- స్థానిక నేతలు పెద్దలతో మాట్లాడిస్తామన్నారు
- టీడీపీ పెద్దల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయి
- టీడీ జనార్ధన్ ఫేస్‌టైం యాప్ ద్వారా పలుమార్లు మాట్లాడే ప్రయత్నం చేశారు
- నేను ఏ ఒక్కరి ఫోన్ లిఫ్ట్ చేయలేదు
- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



తనకు ఫోన్ చేసిన టీడీపీ నేతల కాల్‌లిస్ట్‌ను చూపిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

పట్నంబజారు: ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు సంప్రదించారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ వెల్లడించారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిధర్ మాట్లాడారు. తనను కలిసిన స్థానిక నేతలు టీడీపీ పెద్దలతో మాట్లాడిస్తామని చెప్పారని, మద్దతుగా ఓటు వేయాలని కోరినట్లు వివరించారు. పలువురు టీడీపీ పెద్దలు స్వయంగా ఫోన్ చేసినప్పటికి లిఫ్ట్ చేయలేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్ధన్ తన కోసం ఫేస్‌టైం యాప్ ద్వారా పలుమార్లు ఫోన్ చేశారని చెప్పారు. వారం రోజులుగా తనను సంప్రదించే ప్రయత్నాలు చేసినా తాను స్పందించలేదని పేర్కొన్నారు. జనార్ధన్ ఫోన్ చేయడాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారు. తన ఓటు అవసరం లేదన్నవారు ఎందుకు ఫోన్ చేసినట్లు అని నిలదీశారు. రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటు, కొనుగోలు రాజకీయాలకు పెట్టింది పేరు చంద్రబాబు అని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పే చంద్రబాబు వెన్నుపోటు పొడిచి ఎన్టీఆర్ నుంచి పార్టీని లాక్కున్నారని దుయ్యబట్టారు. కనీస విలువ కూడా ఇవ్వని టీడీపీ నుంచి ప్రజలకు మంచి చేసేందుకు నలుగురం బయటకు వచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి టీడీపీని విడనాడామని చెప్పారు. జగమంత కుటుంబం అనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతమని పేర్కొన్నారు. 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తే గతంలో టీడీపీలోకి ఎమ్మెల్యేలు వచ్చారని, కుళ్లు రాజకీయాలతో తమపైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీకి క్రాస్ ఓటింగ్ చేసిన ఎమ్మెల్యేలు ఉత్తరకుమార ప్రగల్భాలను తలపించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుళ్లు, కుతంత్రాలు, డబ్బు రాజకీయం తనకు ఏ మాత్రం అవసరం లేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. టీడీపీ నేతలు కక్ష సాధింపు, డైవర్షన్ రాజకీయాలు చేసేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 16 మంది తమతో టచ్‌లో ఉన్నారని చెబుతున్న టీడీపీ నేతలు.. కేవలం రెండు క్రాస్ ఓట్లు ఎలా పడ్డాయో చెప్పాలని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసిన ఎమ్మెల్యేలు కట్టుబడి ఓట్లు వేశారని చెప్పారు.

కొడుకు కోసం బాబు రాజకీయాలు..

అనుభవం లేని కుమారుడు లోకేశ్ కోసం చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. కొడుకు భారాన్ని కార్యకర్తలపై రుద్దుతున్నారని, అతడి కోసం పార్టీని తగలబెట్టడం తథ్యమని చెప్పారు. పాదయాత్ర చూస్తే.. ప్రజాస్పందన ఎలా ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు కేవలం నేను–నా వాళ్లు.. అనే పద్ధతిలోనే రాజకీయాలు చేస్తారని, ఆ స్వార్థం చూడలేక బయటకు వచ్చామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోలు ఎలా జరిగిందనేది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమేనన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు చేస్తున్నారని, వారి వ్యక్తిత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉదయం కుమార్తైతో సహా సీఎం జగన్‌ను కలసి.. వెన్నుపోటు పొడవటం కొంత మందికే సాధ్యమవుతుందని ఎద్దేవా చేశారు. వారు చేసిన పనికి నెపాన్ని ఇతరులపై నెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. సరిగా పనిచేయని ఎమ్మెల్యేలకు సీటు లేదని సీఎం జగన్ స్పష్టంగా చెబుతున్నారు కాబట్టే.. ఇటువంటి నీచ రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. అమరావతి రాజధాని అంశంలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి గతంలో ఏం మాట్లాడారో.. ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారో.. ఒక్కసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని మద్దాళి గిరిధర్ గుర్తు చేశారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే జరిమానా

- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- స్పందనలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఏపీ సేవా, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందే అర్జీలను అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోతే రోజుకు రూ.100 జరిమానా విధిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కు అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు. కొందరు ఫిర్యాదుదారులు స్వప్రయోజనాల కోసం తప్పుడు అర్జీలు ఇస్తూ అధికారుల సమయాన్ని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ఉపేక్షించమని హెచ్చరించారు. కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మొత్తం వచ్చిన 145 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి పరిశీలించారు. కొన్ని ఫిర్యాదులు..

టిడ్కో ఇంటికి డబ్బులు కట్టినా..



నేను గతంలో టిడ్కో ఇంటికి రూ.25 వేలు చెల్లించా. ఆ తర్వాత నాకు అడవితక్కెళ్లపాడులో ఇల్లు మంజూరయ్యిందంటే మరో రూ.75 వేలు కట్టాను. ఎవరికో వచ్చిన కరెంట్ బిల్లు నాదని ఇల్లు లేదంటున్నారు. మున్సిపల్ సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాకు న్యాయం చేయాలి.

–కె.పద్మావతి, గుంటూరు

కనీస సదుపాయాలు కల్పించండి



లాల్‌పురం శివారు లింగాయపాలెం సమీపంలో సుమారు 450 కుటుంబాలు పదేళ్లుగా పక్కా ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నాం. మాకు డోర్ నంబర్, మంచినీరు, విద్యుత్, రోడ్లు ఏర్పాటు చేయాలి. అంతా దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన వారమే. అధికారులు మా అభ్యర్థనను మన్నించాలి.

–లింగాయపాలెం గ్రామస్తులు

విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

- కొండవీడు యూపీ స్కూల్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డు
- కాలీగ్రఫీ హ్యాండ్ రైటింగ్, డబల్‌పెన్సిల్, డిజైన్ ఇన్ కలర్స్ విభాగాల్లో ప్రదర్శన
- ప్రదర్శనకు హాజరైన వండర్‌బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు
- సర్టిఫికెట్లతో పాటు మెడల్స్, పుస్తకాలు అందజేత



వండర్‌బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న దృశ్యం

యడ్లపాడు: సృజనాత్మకతకు పట్టం కట్టారు. కాలీగ్రఫీ రైటింగ్‌తో పాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడులోని యూపీ పాఠశాలలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, కాలీగ్రఫీ శిక్షకులు షేక్ జున్నుసాహెబ్, విద్యా వలంటీర్ షేక్ చాందినీ ఆధ్వర్యంలో కాలీగ్రఫీ రైటింగ్‌తో పాటు అందులో విభిన్న డిజైనింగ్ విభాగంపై నెలరోజులు శిక్షణ ఇచ్చారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు బాలబాలికలందరూ పాల్గొని నేర్చుకున్నారు. సోమవారం వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారత ప్రతినిధి వంగ నరేంద్రగౌడ్, న్యాయనిర్ణేతగా అదే సంస్థ ప్రతినిధి గంగాధర్, నరసరావుపేట లిమ్రా కోచింగ్ సెంటర్ చైర్మన్ షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులందరికీ వైట్ చార్టులు పంపిణీ చేసి రెండు గంటల్లో కాలీగ్రఫీలో తాము నేర్చుకున్న విభిన్నతను రాసి చూపించాలని లక్ష్యం ఇచ్చారు. కేవలం గంటా 26 నిమిషాల్లోనే ఎవరికీ వారు సొంతంగా సృజనాత్మకంగా పేర్లు, డిజైన్లు వేసి అందులో రకరకాల రంగుల్లో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు..

కాలీగ్రఫీ రైటింగ్, డిజైన్, కలరింగ్‌లో చూపిన ప్రతిభకు వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించినట్లు ప్రతినిధులు తెలిపారు. వెంటనే పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, క్యాలీగ్రఫీ శిక్షకులు షేక్ జున్నుసాహెబ్, విద్యావలంటీర్ చాందినిలకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్, 2022 ఘనతల పుస్తకాన్ని అందజేశారు.

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధం

- 19,447 టన్నులు రెడీ
- ఆర్‌బీకేలు, సొసైటీలకు మొదటి ప్రాధాన్యం
- ఖరీఫ్‌కు ముందస్తుగా అన్ని రకాల ఎరువులు సరఫరా
- ఖరీఫ్‌కు 1.35 లక్షల టన్నులు అవసరం



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

కొరిటెపాడు(గుంటూరు): రైతుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఖరీఫ్‌కు ముందు దుక్కులు సిద్ధం చేసుకోవడం.. విత్తనాలు సేకరించడం.. నీటి లభ్యతతో పాటు ఎరువులపై దృష్టి పెడతాడు. గతంలో సీజన్ ప్రారంభమైన అదను దాటిన ఎరువు దొరకక నానా అగచాట్లు పడిన పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో సకలం ఆర్బీకేల్లో అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే అవసరమైన ఎరువు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైనన్ని ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది. ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ కంపెనీల ద్వారా వచ్చిన ఎరువులు మొదటి ప్రాధాన్యతగా రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మిగతావి హోల్‌సేల్, రిటైల్ డీలర్లతో పాటు వేర్ హౌస్‌లు, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

19,447 మెట్రిక్ టన్నులు...

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 19,447 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. అందులో యూరియా 8,485 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7,323 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,450 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్(ఎస్‌ఎస్‌పీ) 839 మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) 280 మెట్రిక్ టన్నులు, కాంపోస్ట్ ఎరువులు 70 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ మాసం చివరి నాటికి మరో 20 వేల మెట్రిక్ టన్నులు, మే నెలలో మరో 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రణాళిక ప్రకారం ఎరువులు

జిల్లాలో వరి, పత్తి, మిరప, పసుపు, పల్సస్(మినుము, శనగ, పెసర తదితర) పంటల విస్తీర్ణం, వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని తగినంత సరఫరా, నిల్వలు ఉంచాం. జూన్ మాసం రెండో వారం నుంచి ప్రారంభం కానున్న 2023–24 ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన 1.35 లక్షల టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు చేశాం. అనుమతులు రాగానే నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు సరఫరా అయ్యేలా చూస్తాం. రైతులకు గ్రామాల్లోనే ఎరువులు లభించేలా ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

–నున్నవెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

మాదక ద్రవ్యాలతో సమాజానికి హానికరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

– కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబపరంగా, సామాజిక పరంగా తీవ్ర నష్టాన్ని మిగులుస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులకు ఒకరోజు మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలన్నారు. మన పిల్లలు మంచివారైనా చెడు స్నేహాల కారణంగా తప్పుదోవ పట్టే అవకాశాలున్నాయని చెప్పారు. ఒక్కసారి వాటికి బానిసలైతే తేరుకోవడం చాలా కష్టమని చెప్పారు. గ్రామస్థాయి నుంచి అధికారులు జిల్లాస్థాయి వరకు వీటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. దీన్లో వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంటల్లో గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి

మంగళగిరి: ఆత్మకూరు టీడీపీ జాతీయ కార్యాలయం వద్ద ఈనెల 24వ తేదీన బాణా సంచా కాలుస్తూ ప్రమాదవశాత్తూ బాణాసంచా పేలి తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త సోమవారం రాత్రి మృతి చెందాడు. బాణాసంచా ప్రమాదంలో నలుగురు గాయపడి ఎన్నారై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో నగరంలోని మార్కండేయ కాలనీకి చెందిన తాడిశెట్టి చెన్నయ్య (25) మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం అనాథగా మారింది.

భూ రీసర్వే వేగవంతం

ఈపూరు : పల్నాడు జిల్లాలో భూ రీసర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీ విలేకరులతో మాట్లాడుతూ తొలిదశలో 70 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని, వాటిలో 58 గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ చేశామని, 12 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

సకాలంలో స్పందించండి

- నిర్ణీత వేళల్లో బాధితులకు న్యాయం చేయండి
- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్


సమస్య వింటున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన (గ్రీవెన్స్) జరిగింది. అర్జీదారుల సమస్యలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆలకించారు. స్పందనలో వచ్చే సమస్యలపై సకాలంలో స్పందించాలని ఎస్పీ అన్నారు. చట్ట పరిధిలో అర్జీలకు ప్రాధాన్యత కల్పించి, నిర్ణీత వేళల్లో బాధితులకు న్యాయం అందించేలా చూడాలని చెప్పారు. ఈ మేరకు జూమ్ ద్వారా జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం) అర్జీలు స్వీకరించారు.

బిడ్డ ఆచూకీ లభించడం లేదు

చిన్నప్పటి నుంచి కుమారుని మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. ఇంటి వద్దనే ఉండేవాడు. సిటీబస్‌ల డ్రైవర్‌లైన తండ్రి శ్రీధర్, సోదరుడు శివకృష్ణకు లైబ్రరీ సెంటర్‌లో ప్రతి రోజు భోజనం క్యారేజీ అందించేవాడు. ఈ క్రమంలో గతనెల 28న లాడ్జిసెంటర్‌లో సోదరునికి భోజనం క్యారేజీ అందించాడు. అప్పటి నుంచి తనయుడు హరికృష్ణ ఇంటికి రాలేదు. తెలిసినా వారు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అయితే తనయుడు కనిపించక వారాలు గడిచింది. కుమారున్ని ఆచూకీ గుర్తించగలరు.

– తల్లిదండ్రులు బి.హైమావతి, శ్రీధర్, హనుమయ్యనగర్, కొరిటెపాడు.

ఐరన్ పంపిస్తామని మోసం..

గత నాలుగేళ్లుగా ఆటోనగర్ ఫేజు–2లో పాత ఇనుప వ్యాపారం చేస్తున్నా. శ్రీపుట్టపర్తి జిల్లాకు చెందిన ఇద్దరు సుమారు నెలక్రితం పరిచయమై, మరొకర్ని పరిచయం చేశారు. అతని వద్ద ఐరన్ ఉందని చెప్పారు. దీంతో 50 వేల కిలోల ఐరన్ సరఫరా చేస్తామని ఈ ఏడాది జనవరి 25న ఒప్పందమైంది. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.38 లక్షలు పంపించా. విడిగా రూ.5 లక్షలు చెల్లించా. లారీల్లో ఐరన్ పంపిస్తున్నట్లు నమ్మబలికారు. తర్వాత లారీల్లో ఆయిల్ అయిపోయిందని చెప్పగా, రూ.70 వేలు ఫోన్‌పే చేశాను. అయితే ఇప్పటి వరకు సరుకు అందలేదు. అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు. మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా..

– మీర్ మహమ్మద్ అలీ, శాంతినగరం, చిట్యాల, నల్గొండ జిల్లా.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు!

భర్త 2002లో మరణించారు. వట్టిచెరుకూరు వింజనంపాడులో భర్తకు సంబంధించి ఎకరం ఒక సెంట్ పొలం ఉంది. తనకు తెలియకుండా తెలిసిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, ఎస్పీ గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ మరలా స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చి అస్వస్థతకు గురైంది. దీంతో బాధిత మహిళను చికిత్సకై మహిళా పోలీస్ సిబ్బంది 108లో జీజీహెచ్‌కు తరలించారు.

– వడ్లమూడి సీతామహాలక్ష్మి, అంగలకుదురు, తెనాలి.

మామ కాదు.. కామాంధుడు!

- లైంగిక వేధింపులపై అంధురాలైన కోడలు ఫిర్యాదు
- ప్రాణ రక్షణ కల్పించమంటూ ఎస్పీకి వేడుకోలు!

నగరంపాలెం: పెళ్లయిన దగ్గర్నుంచి మామ లైంగికంగా వేధిస్తున్నాడు. అతనికి ఇద్దరు అత్తలు సహకరిస్తున్నారు. దీనిపై అంధురాలైన ఓ కోడలు భర్తతో కలిసి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక– స్పందన (గ్రీవెన్స్)లో ఫిర్యాదు చేసింది. మామ చేస్తున్న వికృత చేష్టలను చెబుతూ విలపించింది. బాధితురాలి మాటల్లో.. 2013లో క్రితం వివాహమైంది. భర్త ప్రైవేటు విద్యుత్ పనులు చేస్తుంటాడు. ఒక బాబు సంతానం. మామకు ఇద్దరు భార్యలు. అయినప్పటికీ పెళ్లయిన దగ్గర నుంచి మామ వేధించడం మొదలెట్టాడు. ఇద్దరత్తలతో సంసారం చేస్తూ, తనను లైంగిక సంసారం చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నాడు. అదును చూసి బలాత్కారానికి ప్రయత్నిస్తున్నాడు. తన కోరిక తీర్చలేదని పగ పెంచుకున్నాడు. తనతోపాటు భర్తను హింసిస్తున్నాడు. కొడుకు కోసం పెళ్లి చేయలేదని, తన కోసమంటూ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2023 జనవరి 3న ఇద్దరి అత్తల సహాయంతో తనపై లైంగిక దాడికి యత్నించి, శరీరమంతా రక్కాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించా. గతంలోనూ నాపై వేరే వారితో దాడి చేయించాడు. ఇవన్నీ కూడా నన్ను లొంబర్చుకునేందుకు చేసినవే. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయినప్పటికీ మామ ప్రవర్తనలో మార్పులేదు. కామవాంఛతో తనపై, భర్తపై వేరే వ్యక్తులతో దాడి చేయించాడు. కేసుల్లో రాజీకి రాకపోతే అంతు చూస్తానని ఊళ్లో బహిరంగంగా చెబుతున్నాడు. పలుకుబడి ఉన్న మామ ఏదైనా చేసేందుకు సిద్ధహస్తుడని తెలిపింది. తమకు ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీని అభ్యర్థించింది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో సిద్ధహస్తుడు బాబు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే). పక్కన ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ధ్వజమెత్తారు. నగరంలోని మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే ఆర్కే విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ చరిత్రలో చంద్రబాబు లాంటి దిగజారుడు రాజకీయాలు చేసే నాయకుడు మరొకరు లేరని విమర్శించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి వేరే పార్టీ మారాలనుకునే వారు కనీస ఇంగితజ్ఞానం, నైతికత, విలువలు పాటించి వారు పొందిన పదవులకు రాజీనామా చేసి పార్టీ మారడం కనీస రాజకీయ ధర్మం అన్నారు. నాడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడిన సమయంలో తనతో పాటు తన వెంట వచ్చిన వారితో రాజీనామాలు చేసి మరలా ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారని గుర్తించుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలలో నైతికత, విలువలు పాటించబట్టే జనం వెంట నడిచారన్నారు. వైఎస్సార్ పార్టీ తరపున గెలిచి పార్టీకి ద్రోహం చేసిన నలుగురు ఎమ్మెల్యేలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేస్తే వారు ఎలాంటి ప్రలోభాలకు గురికాలేదనుకోవచ్చునని, అలా కాకుండా రూ. కోట్లకు అమ్ముడుపోయి ప్రలోభాలకు లొంగిపోయి అర్థం లేని విమర్శలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబుకు జనాదరణ ఏనాడూ లేదని చంద్రబాబు రాజకీయ జీవితమంతా వెన్నుపోటులు, డబ్బుతోనే నడిచాయని మండిపడ్డారు. చంద్రబాబుతో ఎన్ని పక్షాలు కలిసినా వైఎస్సార్ సీపీని ఓడించడం వారి తరం కాదన్నారు. చంద్రబాబు రాజకీయాలలో ఎంతగా దిగజారుతారనేదానికి నిదర్శనం ఎలాంటి బలం లేని తెలంగాణలో ఎమ్మెల్సీని కొనుగోలు చేస్తూ పట్టుబడడమేనన్నారు. మంగళగిరిలో మూడు శాఖల మంత్రిగా ఉన్న కుమారుడు లోకేష్‌ను గెలిపించుకోలేని చంద్రబాబు తాను మరలా గెలిచి సీఎం అవుతాడనుకోవడం భ్రమేనని ప్రజలు సైతం గుర్తించారన్నారు. రాజధానిలో ఇన్‌సైడింగ్ ట్రేడింగ్‌తో కావల్సిన వారికి కావల్సినట్లు వేలాది ఎకరాలు రైతుల భూమిని కట్టబెట్టి కోట్ల రూపాయలు దోచుకున్న చంద్రబాబు ఆ డబ్బుతో ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురిచేయడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు మీద నమ్మకం లేదు కాబట్టే రాజధానిలోని తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో 2019లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించిందన్నారు. చంద్రబాబుకు 2024 ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇవే చివరి ఎన్నికలని చంద్రబాబుతో టీడీపీ నాయకులు గుర్తించుకుంటే మంచిదని హితవు పలికారు.

సంచలనం కోసం శ్రీదేవి ప్రాణహాని వ్యాఖ్యలు

ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

తాడికొండ: మీడియా సంచలనం కోసం ఉండవల్లి శ్రీదేవి తనకు ప్రాణహాని ఉందనే వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, సజ్జల గారికి నీతో ఏంపని, ఆయన స్థాయి ఏంటి మనస్థాయి ఏంటని ఆలోచించుకోవాలని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం వెంకటపాలెం టీటీడీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉండవల్లి శ్రీదేవి అనవసరమైన ప్రేలాపనలు మాట్లాడకుండా తనపని తాను చూసుకుని కార్యక్రమా లు చేసుకోవాలన్నారు. ఆమె ఎవరితో పని చేయాలనుకుంటే వారితో పనిచేయవచ్చని, అమరావతి రైతుల కోసం పనిచేస్తానంటే చెయవచ్చని, అమరావతి రైతులకు తాము కూడా వ్యతిరేకం కాదని వారికోసం తాము పని చేస్తున్నామన్నారు. రాజకీయంగా ఉండవల్లి శ్రీదేవి చేసిన వ్యాఖ్యలకు తాము వ్యతిరేకమని, అనవసరమైన ఆరోపణలు చేసి ప్రజల్లో పలచన కావద్దని సూచించారు. వివాదాస్పద వ్యాఖ్యలు ద్వారా ఎదుగుదామనుకోవడం తప్పని, ఆమె ఎంచుకున్న మార్గంలో ప్రత్యేకంగా వెళ్లిపోతే తప్పులేదు కానీ, అనవసరంగా వ్యక్తులను నిందిస్తూ సజ్జల గారిపై ప్రాణహాని వ్యాఖ్యలు చేయడం వలన పత్రికల్లో ఓ రోజు పబ్లిసిటీ వస్తుంది తప్ప ప్రయోజనం ఉండదన్నారు. ఆమెకు ఎలాంటి ప్రాణభయం లేదని, అన్ని రక్షణ వ్యవస్థలు అనుకూలంగా ఉంటాయని, తాము కూడా వ్యక్తిగతంగా ఏమీ జరగకుండా చూస్తామని, ఆమె పనులు ఆమె చూసుకోవచ్చన్నారు.

బీజేపీ నేత అమ్మిశెట్టి మృతికి పలువురు నివాళులు

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమ్మిశెట్టి ఆంజనేయులు (60) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. ఆయన అంత్యక్రియలు సోమవారం స్థానిక బొంగరాల బీడు శ్మశాన వాటికలో జరిగాయి. బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ జీ, సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, పలు రాజకీయ పార్టీల నాయకులు, స్నేహితులు, బంధువులు, అభిమానులు అమ్మిశెట్టి ఆంజనేయులు పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

సోము వీర్రాజు నివాళి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం రాత్రి గుంటూరులోని అమ్మిశెట్టి ఆంజనేయులు భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆంజనేయులు అకాల మరణం పార్టీకి తీరని లోటని, బీజేపీకి ఎంతో సేవ చేశారన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ

- శ్రీదేవి రాజకీయాలకు అనర్హురాలు
- నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించి శ్రీదేవి నీతులు వల్లించడం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ నాయకులు


తాడికొండలో ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఫిరంగిపురంలో ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడికొండ: ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ తెచ్చిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రాజకీయాలకు అనర్హురాలని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. తాడికొండ మండలం లాం గ్రామంలోని ప్రధాన కూడలిలో శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేసిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి పార్టీని అడ్డుపెట్టుకొని భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. అంగన్‌వాడీ ఆయా మొదలుకొని నామినేటెడ్ పోస్టులను అమ్ముకొని భారీ అవినీతికి పాల్పడిన ఆమె మీడియాలో దళిత కార్డు అడ్డుపెట్టుకొని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలుగు సంవత్సరాలు వైఎస్సార్ సీపీ పాలనలో అధికారం అనుభవించి చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం పార్టీని వీడిని ఆమెకు నిజంగా ప్రజల మద్దతు ఉంటే నియోజకవర్గానికి వచ్చి ప్రజాసేవ చేస్తే బండారం బయట పడుతుందన్నారు. నిన్న మొన్నటి వరకు అమరావతి రైతుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ ప్రత్యేక పోలీసు వాహనాన్ని పెట్టుకొని తిరిగిన ఎమ్మెల్యే శ్రీదేవి ఇప్పుడు అమరావతి ఉద్యమంలో పాల్గొంటామనడం ఆమె అవినీతి పరాకాష్టకు చేరిందనేందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మీర్జావలి, నూర్జహాన్, రావూరి నరేష్, దాసరి ప్రకాశం, భాగ్యారావు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి దిష్టిబొమ్మ దహనం

ఫిరంగిపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం సాయంత్రం సొలసబస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ మాట్లాడుతూ అవినీతి రాజకీయాలు చేసింది శ్రీదేవేనని ధ్వజమెత్తారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ డి.చంద్రం, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, బి.అంజిరెడ్డి, పాలపాటి రఘు, హేమలత, పి.చిన్న,డి.నరేంద్రకుమార్, పి.జోసఫ్, సీహెచ్ రామమోహన్‌రెడ్డి, మీరా, పిచ్చిరెడ్డి, రంజన్‌బాబు, ఇజ్రాయిల్, రత్నబాబు, టి.డేవిడ్ , వి.రాము, చిన్నయ్య, జోసఫ్, కె.రామారావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్రవంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటుగా క్రీడలు, ఇతర రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు తమ కళాశాల కృషి చేస్తుందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏప్రిల్ 14, 15 తేదీలలో నిర్వహించనున్న విజ్ఞాన్ స్రవంతి సాంస్కృతిక క్యార్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర కళాశాలల విద్యార్థులకు వివిధ రంగాల్లో లలితకళలు, చిత్రలేఖనం, క్రీడలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి అనూరాధ మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

వేటపాలెం: జిల్లా తీరం వెంట సముద్ర తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్టు రేంజర్ ఆర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలోని ట్రీఫౌండేషన్‌లో తాబేళ్ల సంరక్షకులకు అవగాహన ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 2017 నుంచి జిల్లాలో ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సంరక్షిస్తున్నామని తెలిపారు. సముద్ర జీవవైవిధ్యంలో భాగంగా ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని సంరక్షించుకోవడం కోసం తీర ప్రాంత గ్రామాల్లో సంరక్షకులను ఏర్పాటు చేశామని తెలిపారు.